www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 ఏప్రిల్ 2023



12న నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ ప్రత్యేక సమావేశం ఈ బుధవారం తే.12.04.2023దిన నిర్వహించనున్నామని నగర మేయర్ స్రవంతిజయవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశంలో 2022-23 సవరించిన బడ్జెట్, 2023-24 బడ్జెట్ ను మేయర్ ప్రవేశపెట్ట నున్నారు. బుధవారం ఉ.10.30 గం.లకు నగరపాలక సంస్థ కార్యాలయంలోని డా.ఏ.పీ.జే. అబ్దుల్ కలాం కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశానికి డిప్యూటి మేయర్లు, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్-అఫీషియో సభ్యులు అందరూ తప్పకుండా హాజరు కావాలని మేయర్ కోరారు. సమావేశ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నగరపాలక సంస్థ అధికారులు పర్యవేక్షించాలని మేయర్ ఆదేశించారు.

మేయర్ స్రవంతి జయవర్ధన్

'మేకపాటి'పై మూకుమ్మడి దాడి..!

◆రూ.17కోట్లకు పదవులు అమ్ముకున్నాడు
◆ఉదయగిరి నేతల విమర్శనాస్త్రాలు
◆విచారణకు సిఎంకు నివేదిక

ఉదయగిరి ఎంఎల్ఎ, వైసిపి నుంచి సస్పెండ్‌కు గురైన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై ఆ పార్టీ మూకుమ్మడి దాడికి దిగింది. ఆయన అవినీతి చిట్టాలను బయటపెడుతూ అధిష్టానానికి ఫిర్యాదు చేసింది. గత ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి స్థానాల్లో రూ.17కోట్లకు అమ్ముకు న్నారని ఆ పార్టీ ఉదయగిరి నేతలు బహిరంగా విమర్శలు చేశారు. ఆ నాయకులు సోమవారం నెల్లూరు నగరంలో ఆ పార్టీ నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి నేతృత్వంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయన అవినీతి చిట్టాను సిఎంకు సమర్పిస్తున్నామని తెలిపారు. మరో వైపు ఆయన సోదరుడు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆయనపై విమర్శలు చేశారు. ఉదయగిరి ఎంఎల్ఎ టికెట్‌ను మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె రచనారెడ్డికి ఇవ్వాలని సిఫార్సు చేయడంతో ఆ పార్టీలో అసంతృప్తులు నెలకొన్నాయి.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పై ఆ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో కొద్ది రోజులుగా ఆయనను ఉదయగిరిలో అడుగు పెట్టనివ్వమంటూ కొందరు నేతలు సవాల్ విసిరినట్లు సమాచారం. అందుకు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరి బస్టాండ్‌కెళ్లి ప్రతి సవాళ్లు విసిరారు. ఉదయగిరిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొననున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఉదయగిరి నేతలు కొడవలూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో భారీ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. తీవ్ర విమర్శలు చేశారు. గత ఎన్నికల సమయంలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆయన సతీమణి శాంతమ్మ నియోజకవర్గంలో అన్ని పదవులు అమ్ముకున్నారని విమర్శించారు. చేజర్ల సుధాకర్‌రెడ్డి ఉదయగిరి ఎంపిపి స్థానానికి రూ.50లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. వింజమూరుకు చెందిన కొండారెడ్డి 12ఎంపిటిసి బిఫారం కోసం రూ.40లక్షలు ఎంఎల్‌ఎకు నేరుగా ఇచ్చినట్లు తెలిపారు. ఉదయగిరి జెడ్‌పిటిసి స్థానానికి ఎం.రామాంజనేయులు రూ.50 లక్షలు ఇచ్చారన్నారు. వింజమూరు ఎంపిటిసి వెంకటసుబ్బారెడ్డి రూ.5లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఇలా నియోజకవర్గంలోని నేతలందరూ తమ పదవులు కోసం ఎంఎల్‌ఎకు నేరుగా రూ.17కోట్లు అందించినట్లు ప్రకటించారు. ఇదే సమయంలో గతంలో ఉదయగిరి ఇన్‌ఛార్జిగా ఉన్న కొడవలూరు ధనుంజయరెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులన్నీ ఆయన సిఎంకు అందించనట్లు కొడవలూరు ధనుంజయరెడ్డి మీడియాకు తెలిపారు. ఎంఎల్ఎ అవినీతిపై విచారణ జరపాలని ఆ పార్టీ నేతలందరూ డిమాండ్ చేస్తున్నారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఆ నియోజకవర్గ నేతలంతా ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడుతుండడంతో ఎంఎల్ఎ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తనకు ఆరోగ్యం బాగాలేదని, తనను వదిలేయాలంటూ ఎంఎల్ఎ చెబుతున్నా వైసిపి స్థానిక నాయకులు ఆయనతో తాడోపేడో తేల్చుకునేలా రంగం సిద్ధం చేసుకున్నారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబం పార్టీ పరువు తీశారంటూ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అతనికి ఎంఎల్ఎ టికెట్ ఇవ్వొద్దంటూ తాను ఎప్పుడో సిఎంకు చెప్పానని చెప్పుకొచ్చారు. తాజాగా ఉదయగిరి వైసిపి అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి భార్య కుమార్తె ఆదాల రచనా రెడ్డి పేరును ఆయన తెరపైకి తెచ్చారు. సిఎం తనను అడిగితే రచనా రెడ్డికే సపోర్టు చేస్తానంటూ ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉదయగిరి టికెట్ ఆశిస్తున్న చేజర్ల సుబ్బారెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, చిరంజీవిరెడ్డిలు అదెలా కుదురుతుందన్నట్లు పెదవి విరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి వైసిపి రాజకీయం రసవత్తంగా మారింది. ఏం జరుగుతుందో చూడాలి.

'ప్రకాశం'లో క్రీడల పోటీలు

ప్రజాశక్తి-కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో ఈ వారాన్ని క్రీడల పోటీలు వారంగా నిర్వహిస్తామని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అకడమిక్స్ ఇన్‌ఛార్జి ఎస్ఎం మీరావలి సోమవారం వెల్లడించారు. ఈ సందర్భాన్ని విద్యార్థుల్లో ఆటలు క్రీడల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు వినియోగించుకోవాలని రామయ్య ఉద్బోధించారు. అంతర్గత పోటీలలో విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని వారు వెల్లడించారు. రెండు రోజులు గడువుతో 200 మంది విద్యార్థిని, విద్యార్థులు చెస్ పోటీలకు నమోదు చేసుకొని రికార్డ్ సృష్టించారని పేర్కొన్నారు. ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తామన్నారు. సోమవారం ఓపెన్ ఆడిటోరియంలో చెస్ పోటీలను ప్రారంభించి క్రీడలు మానసిక ఉల్లాసానానికి ఉపయోగపడతాయని ఉద్బోధించారు. ప్రతి ఆటలో విన్నర్స్- రన్నర్స్‌కు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. ఓపెన్ గేమ్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. విద్యార్థినులకు టెన్నికాయిట్ కోర్టు హాస్టల్లోనే ఏర్పాటు చేయిస్తామన్నారు. ఖోఖో, త్రో బాల్ కాలేజీ గ్రౌండ్‌లో మహిళా అధ్యాపకులు నిర్వహిస్తారన్నారు. విద్యార్థినులకు స్కిప్పింగ్, కారమ్స్ పోటీలు కూడా ఉంటాయన్నారు. విద్యార్థులకు నిర్వహించే వాలీబాల్,కబడ్డీ పోటీలకు నిపుణులైన పీడీలను బయట నుంచి ఆహ్వానించమన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గుడ్లూరు: బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈసంఘటన మండలంలోని అడవిరాజుపాళెం వద్ద సోమవారం జరిగింది.స్థానికుల సమాచారం మేరకు..బైక్‌పై వి.సుబ్బారావు, కీర్తి బంగారమ్మ ఇద్దరు బయల్దేరారు. వీరు అడవి రాజుపాళెం నుంచి అమ్మవారిపాళెంకు వెళ్లే రహదారిలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. ఇద్దరికి గాయాలయ్యాయి.వెంటనే స్థానికులు గాయపడిన వారిని ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుత్తు ఛార్జీల పెంపు దారుణం

విద్యుత్తు భవన్ ఎదుట టిడిపి ఆందోళన

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ నగరంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కరోనా కష్టకాలంలో ఉన్నారని కూడా చూడకుండా విద్యుత్ ఛార్జీల పెంపుతో రూ.17 వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. అంతటితో ఆగకుండా మరో మారు మేలో యూనిట్‌కు 40 పైసలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని వినియోగదారులపై భారం మోపనున్నదన్నారు. పది రాష్ట్రాలు తిరస్కరించిన రైతు మోటార్లకు మీటర్లను ఎపిలో అమలు చేస్తు నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. పక్క రాష్ట్రంలో మీటర్‌కు రూ.1800 తీసుకుంటుంటే, ఎపిలో మాత్రం 30 వేలు వసూలు చేయడం ఎంత వరకు న్యాయమన్నారు. విద్యుత్ కోతలు పవర్ హాలిడేస్ వల్ల ఎపిలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనలు, సలహాలు మేరకు జిల్లాలోని థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఆదానికి అప్పచెబితే విద్యుత్ ఛార్జీలు ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయి ఇటీవల నిర్వహించిన ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజలు సరైన సమాధానం చెప్పారని, త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీకలు ప్రజలు తమ ఓటుతో సరైన సమాదానం చెబుతారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి, ప్రజలు కరోనా కష్టకాలంలో ఉన్నారని చూడకుండా 17093 కోట్ల అధిక భారాన్ని ప్రజలపై మోపారన్నారు. 2020 ఫిబ్రవరిలో 500 యూనిట్లు దాటిన వారిపై 90 పైసలు ఛార్జీల పెంపుతో 1300 కోట్ల రూపాయలు, మే లో శ్లాబుల మార్పుతో 1500 కోట్లు, అలానే ఏప్రిల్‌లో కిలో వాట్ కు 10 రూపాయలు పెంచి 2542 కోట్లు ప్రజల పై భారం మోపారన్నారు. ఐదు సంవత్సరాల వెనుక వాడిన బిల్లులను తీసుకుని వచ్చి 2014 నుండి 2019 వరకు ట్రూ అప్ చార్జెస్ పేరుతో 3669 కోట్లు ప్రజల పై భారం మోపారన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని రైతు పండించిన పంటను అమ్ముకునే పరిస్థితులు లేవని, అన్నింటినీ పక్కనపెట్టి రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోతున్నారని, పది రాష్ట్రాల్లో తిరస్కరించిన వాటిని ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

అర్జీలు పునరావృతం కాకూడదు

ప్రజాశక్తి-నెల్లూరు: స్పందన కార్యక్రమానికి అందే అర్జీలు మళ్లీ మళ్లీ పునరావతం కాకుండా సంతృప్తికర స్థాయిలో నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్ఓ వెంకటనారాయణమ్మతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దష్టి సారించడంతో పాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు, కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బి.చిరంజీవి, పీడీలు సాంబశివరెడ్డి, వెంకటరావు, శ్రీనివాసులు, వెంకటదాసు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు

ప్రభుత్వ స్థలం కాపాడండి

ప్రజాశక్తి-నెల్లూరు

నగరం కార్పొరేషన్ పరిధిలో 23వ డివిజన్లో జెవి ఆర్ఆర్ కాలేజ్ పక్కన సప్తగిరి లేఅవుట్ ఎల్పీ నెంబర్ 95/91 ఈ లేఔట్ ప్రకారం నగరపాలక సంస్థ పార్కు నిర్మాణం కోసం 4 ఎకరాల 143 సెంట్లు స్థలం కేటాయించడం జరిగింది. కొంత మంది భూ కబ్జాదారులు దానిని ఆక్రమించుకున్నారని, అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వా స్థలాన్ని కాపాడాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ స్పందన కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ ఆదేశాల మేరకు స్థానిక టిడిపి నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.నగరపాలక సంస్థ వారు చర్య తీసుకోపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజల్ని కలుపుకొని భారీ ఎత్తున ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో కందిరాజు సుబ్బరాజు, యోగానందం, శ్రీనివాసులు రాజు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి ధర్నా

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రధాన సెంటరు నుంచి ర్యాలీగా విద్యుత్ శాఖ కార్యాలయం వరకు వెళ్లారు. అక్కడ కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం తిరిగి బస్టాండ్ సెంటరుకు వచ్చి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసినట్లు, ఆ సమయంలో ఛార్జీలు సైతం పెంచలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని విమర్శించారు. ఇంకా ఏడుసార్లు ఛార్జీలు పెంచి, ప్రజలపై వేల కోట్లు భారం మోపారన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించడం రైతులను నిలువునా మోసం చేయడమేనన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని, నియోజకవర్గంలో ఇంటూరి నాగేశ్వరరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ గట్టమనేని చెంచురామయ్య, ప్రధాన కార్యదర్శి గురిజాల బెంజిమెన్, మండల యువత అధ్యక్షులు బద్దిపూడి శిఖామణి, మాజీ మండలాధ్యక్షులు పరిటాల భాస్కరరావు, టిడిపి నాయకులు వలేటి నరసింహం, పోకూరి మాల్యాద్రి, పంది లక్ష్మీనారాయణ, అనుమోలు సుధాకర్, గట్టమనేని సుబ్బారావు, గట్టమనేని లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

ధర్నా చేసుప్తన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు: విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ టిడిపి పిలుపుమేరకు స్థానిక కోవూరు రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. మండల పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజ కవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటూరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై 17 వేల కోట్ల భారం మోపారని, పేద, మధ్యతరగతి ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల బాదుడు దారుణంగా ఉందని విమర్శించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటులో భారీ స్కాం జరుగుతోందని, మహారాష్ట్రలో ఒక్కోమీటర్ కు రూ.18వేలు ఖర్చు చేస్తుంటే, ఎపి రూ.30 వేలకు పైగా కేటాయించిందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, సిఎం డౌన్ డౌన్ అంటూ నేతలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, కూనం నరేంద్ర, గోచిపాతల మోషే, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేసుప్తన్న ఇంటూరి, తదితరులు

సాయి కళ్యాణి అక్రమ అరెస్టుపై ఖండన

ప్రజాశక్తి -కందుకూరు: తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్పూరి సాయి కళ్యాణి అరెస్టును కందుకూరు తెలుగు మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరికీ గొంతును నొక్కేయాలని చూస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని నువ్వు మహిళల భద్రత గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కళ్యాణిని అదుపులో తీసుకునే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చ అని అన్నారు. 'మీరు చేసే ప్రతి పనికి' ప్రతి చర్య ఉంటుందని గుర్తుంచుకొని ప్రవర్తించాలన్నారు.

వైసిపికి అభినందన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: సచివాలయ మండల కన్వీనర్, కోవెరపాలెం సర్పంచ్ తలమంచి సురేంద్ర బాబు చిన్నచెరుకూరు గ్రామంలో టీడీపీ నాయకులు బొమ్మి సుబ్బారావు ఇంటికి ప్రజా మద్దతు బుక్ లెట్ తో వెళ్లారు. బొమ్మి సుబ్బారావు సానుకూలంగా స్పందించారు.


ఎంఎల్ఎతో మాట్లాడుతున్న ప్రజలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గుడ్లూరు : ప్రభుత్వ పథకాలతో స్థానిక సమస్యలు పరిష్కారం చేయాలని ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మండలంలోని అమ్మవారి పాలెం ఎస్‌సి కాలనీకి చెందిన మహిళలు ఎంఎల్ఎ మహీధర్ రెడ్డి దష్టికి తీసుకొచ్చారు. ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులు అధికారులు అమ్మవారిపాలెం ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని అమ్మఒడి ఇతర పథకాలు అర్హులైన వారందరికీ వచ్చేటట్లు చూడాలని మహిళలు వేడుకున్నారు దీంతో పనితీరుపై ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కారం చేయకుండా ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రతి సమస్య వెంటనే పరిష్కారం చేస్తేనే సచివాలయం వ్యవస్థ ప్రజలకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సూర్యనారాయణ సింగ్, ఎంపిడిఒ శ్రీనివాసులు రెడ్డి, విద్యుత్ శ్రీనివాసులు, వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు, ఎంపీపీ పులి రమేష్ , జెడ్‌పిటిసి మండల నాయకులు కె.కష్ణ, గొర్ల రమేష్, ఏర్ల వెంకటేశ్వర్లు, చెరుకూరు సూర్యనారాయణ, నరసరాజు, బిల్లా రమణయ్య పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న'

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని కొండసముద్రం గ్రామంలో సోమవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మన్నం వెంగమ్మ, ఉపసర్పంచ్ కొల్లి వెంకటనరసింహం, వైసిపి నాయకులు మన్నం వెంకటరమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మన్నం వెంగమ్మ మాట్లాడుతూ మూడు రోజుల సర్వేలో 21 లక్షల గృహాలను సందర్శించగా, 15 లక్షల మంది ఫోన్ మిస్‌డ్‌కాల్ రూపంలో జగనన్నకు మద్దతునిచ్చినట్లు పేర్కొన్నారు. అత్యధికంగా సంక్షేమ పథకాల అమలు ద్వారా నేరుగా ప్రజలకే నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సుధీర్‌రెడ్డికి అభినందన సభ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని మూడు పంచాయతీల్లో కేవలం మూడు రోజుల్లో జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజాభిప్రాయం సేకరించిన అంశాన్ని పురస్కరించుకొని సోమవారం పోట్లపూడి గ్రామంలో సుధీర్ రెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల మండల కన్వీనర్ తలమంచి సురేంద్ర బాబు సుధీర్ రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా రంజక పరిపాలన అందిస్తుండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమ వారం ఊరిబయట నిస్సహాయలులైన వృద్ధులను, వికలాంగులను గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అందిజేశారు. ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ అన్నారు.కార్యక్రమంలో ప్రెసిడెంట్ సాజిద్, ట్రెజరర్ హఫీజ్, ఇన్‌ఛార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్, ఖలీల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు: పేదవారి ఆకలిని తీర్చే దిశగా కందుకూరు శ్రీరామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా సోమ వారం రావుల తులశమ్మ 7వ వర్ధంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. తులశమ్మ భర్త రావుల శింగయ్య, కుమారుడు రవికుమార్, ఈశ్వరమ్మ దంపతులు, కుమార్తె సుబ్బలక్ష్మి, నర్ర హరిబాబు దంపతుల సహకారంతో కందుకూరు కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల ఆశ్రమంలో పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: డివిజన్ జీవనజ్యోతి వికలాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ దాత జంగాల రవి కోటి సహకారంతో ఆయన పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు, శీలం కోటేశ్వరి, అరుణ వెంకటేష్, మైత్రేష్, నితీష్, చింతాబాత్తిన స్నేహిక, ప్రహర్షిని, నిహారిక, రష్మిత పాల్గొన్నారు.


దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

డిపిఆర్‌ఒగా కె.సదారావు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా కె సదారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి డిఐపిఆర్ఒ గా ఉన్నటువంటి ఎ రమేష్ నుంచి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు విజయవాడ సమాచార పౌర సంబంధాల శాఖ, కమిషనర్ వారి కార్యాలయం లో ఉప సంచాలకులు గా పనిచేస్తూ బదిలీ పై నెల్లూరు డిఐపిఆర్వో గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డి ఐ పి ఆర్ ఓ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రభుత్వం పేద, బలహీన వర్గాల కోసం అమలు చేస్తున్న నవరత్నాలు, అభివద్ధి, సంక్షేమ పథకాలను, గడపగడపకు మన ప్రభుత్వం తదితర కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా ద్వారా విస్తత ప్రచారం చేస్తామన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఐపిఆర్వోకు కార్యాలయ సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పిఆర్ఒ రమేష్, ఏపీఆర్ఓ రవీంద్ర, పిఆర్వో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌పికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-నెల్లూరు

బదిలీపై వెళ్తున్న ఎస్‌పి సిహెచ్ విజయరావుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. సోమవారం పోలీసు పేరేడ్ గ్రౌండ్ నుంచి ఎస్‌పి కుటుంబ సభ్యులను పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఆయన స్వగృహం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో 21 నెలల పాటు విధినిర్వహణలో సాధించిన విజయాలను, అందుకు సహకరించిన సిబ్బంది సేవలను స్మరించుకున్నారు. విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది సున్నిత అంశాలను నిర్లక్ష్యం చేయకుండా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో చోటు చేసుకున్న పలు ఘటనలు, వివిధ రకాల స్థాయి, ప్రదేశాలలో అన్ని విధులను ఒక బందంగా కలిసి ఎటువంటి సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించడం మరువలేనన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ జీవితంలో అత్యున్నత స్థాయికి చేరు కోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఎస్‌పి సిహెచ్ విజయరావు తన జీవితంలో మరింత అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోరుకున్నారు. అనంతరం పోలీసు అధికారులు ఎస్.పి.ని పెరేడ్ గ్రౌండ్ నుండి క్యాంప్ ఆఫీసు వరకు జైజై నినాదాలతో పూల వాహనంపై స్వయంగా లాగుతూ ఘన వీడ్కోలు పలికారు.

ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సోమిరెడ్డిపై కాకాణి విమర్శలు

ప్రజాశక్తి-పొదలకూరు: మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తాను మంత్రిగా ఉన్న సమయంలో ఆర్భాటంగా, అట్టహాసంగా శంకుస్థాపన శిలాఫలకాలు వేసి వెళ్లారని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ..తాను అధికార పార్టీ ఎమ్మెల్యేగా నిధులు తీసుకొచ్చి పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవ శిలాఫలకాలు వేశానని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని పార్లపల్లి గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపనలకే పరిమితమైన సోమిరెడ్డి, తాను పనులను పూర్తి చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన హయాంలో మంజూరైన ఇళ్ల బిల్లులు పెండింగ్ పెట్టి, రికార్డులను అస్తవ్యస్తం చేసి గద్దె దిగి వెళ్లిపోయాడన్నారు.గ్రామానికి విచ్చేసిన కాకాణి కి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అంతకు ముందు ఆయన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిపారు. కార్యక్ర మంలో మండల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు జి. గోపాల్ రెడ్డి, కె.చిన్న బ్రహ్మయ్య, ఎం.శేఖర్, వాకాటి శ్రీనివాసులు రెడ్డి, మద్ది రెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

శ్మశాన స్థలం మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-సీతారామపురం: సీతారామపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని 234-6 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని గత కొన్ని సంవత్సరాలుగా సంఘసానిపల్లి గ్రామానికి చెందిన పలు కులాలకు చెందిన వారు శ్మశాన స్థలంగా వాడుకుంటూ అంత్యక్రియలను నిర్వహిస్తున్నామని అయితే కొందరు ఆ శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుంటున్న నేపథ్యంలో సత్వరమే చర్యలు తీసుకొని శ్మశాన స్థలంగా రికార్డులో పొందుపరిచి గ్రామస్తులకు మంజూరు చేయాలని సంగసానిపల్లి గ్రామస్తులు తహశీల్దార్ ఎం.శ్యాంసుందర్ రాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం ఎస్‌సి ఎస్‌టి కుటుంబాలకు శ్మశాన స్థలాలను కేటాయించాలని ప్రభుత్వం కలెక్టర్ల ఉత్తర్వులు ఇచ్చినందున వల్ల అప్పట్లో తహశీల్దారుకు శ్మశాన స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశామన్నారు. అయితే అధినేతలో భాగంగా అప్పటి తహశీల్దార్ సెక్షన్ కావడంతో తదుపరి ప్రక్రియలో జాప్యం జరిగిందని అయితే ఆదివారం శ్మశాన స్థలానికి పక్కన కంచెలో సాగుకు చెందిన 68 సెంట్ల పట్టా భూమి ఉందని దాన్ని ఆదివారం ఓ వ్యక్తి కొనుగోలు చేశానని చెబుతూ, కొనుగోలు చేసిన భూమితో పాటు శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించి కంచె వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణలను అడ్డుకొని సత్వరమే శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని ప్రహరీ గోడ, దహన షెడ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కోరుతున్నామన్నారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఫిర్యాదు అందిన వెంటనే ఆరోపణలు వస్తున్న ప్రదేశంలో పనులను నిలిపివేయాలని పూర్తి ఆధారాలను పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. గ్రామస్తులు జి.వెంకటేశ్వర్లు, నూకసాని వెంగయ్య, జి.వినోద్, వెంకటయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం..

ప్రజాశక్తి-మర్రిపాడు: నాడు-నేడు కింద ఎంపికైన చిలకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన భవన నిర్మాణాల్లో ఎటువంటి లోపాలు లేకుండా పనులు జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయురాలు తాన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.కోటి 36లక్ష 97వేలు మంజూరయ్యాయన్నారు. మొదటివిడతగా రూ.20లక్ష 54వేలు ఖాతాలో జమ కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టీలు, మెటల్, ఇటుకలు కొనుగోలు చేసి బిల్డింగ్ పునాది పనులు చేపట్టామన్నారు. కానీ నాణ్యత లేదంటున్నారు. 26వేల ఇటుకలు తోలగా అక్కడక్కడ కొన్ని ఇటుకలు కాస్త సరిగా లేనందున వాటిని పక్కన వేసి నిర్మాణానికి మంచి ఇటుకలు వాడాలని సూచించారు. తాము ఆర్డర్ పెట్టిన సిమెంట్ రాకపోవడంతో అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆదేశాలతో దగ్గరలో ఉన్న స్కూల్లో ఉన్న సిమెంట్ను తీసుకొనివచ్చి నిర్మాణాలు చేపట్టారు. గత నవంబర్ లోపలే భవన నిర్మాణానికి ప్రభుత్వం సిమెంట్ సరఫరా చేయగా బయటగా తెచ్చుకున్న సిమెంట్ను ఆ స్కూల్‌కు ఇవ్వగా, మిగిలిన సిమెంట్ కొంత నిర్మాణానికి ఉపయోగించి ఇప్పుడు నగదు అయిపోవడంతో వంద బస్తాల సిమెంట్‌ను గదిలో ఉంచి మార్చి 14న మళ్లీ నిధులు రావడంతో నిర్మాణం చేపట్టగా కొన్ని సిమెంట్ బస్తాలలో గాలి గడ్డలు ఉండగా అవి పక్కన పడవేసి మంచి సిమెంట్ వాడామన్నారు. సమగ్ర శిక్ష ఏఈని వివరణ అడుగగా నాడు-నేడు పనులలో నాణ్యతలో రాజీ పడేది లేదన్నారు. తాను ఇన్‌ఛార్జి ఇంజనీరింగ్ అసిస్టెంట్, ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గాలిగడ్డలు ఉన్న సిమెంట్ భవననిర్మాణంలో ఉపయోగించడం లేదన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-మర్రిపాడు: పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుములు, పిల్లిపెసర విత్తనాలు ప్రభుత్వం తరఫున 50శాతం సబ్సిడీతో రైతులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్ తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామ సచివాలయంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల ఇండెంట్ ఇచ్చినట్లయితే వారంలో అందజేస్తామన్నారు. కొత్తగా భూముల కొనుగోలు చేసిన రైతు భరోసా రాని వారు ప్రస్తుతం కంప్యూటర్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, రైతు భరోసా తీసుకుంటూ మృతి చెందినట్లయితే మరణ ధ్రువీకరణ పత్రంతో సచివాలయంలో వ్యవసాయ సహాయకులను కలిసి నామినీ పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. మండలంలో 1017మంది రైతులు పిఎంకిసాన్ 13వ విడత నగదు రైతుల ఖాతాలో జమ కాలేదని అలాంటి వారు ఈకెవైసి చేయించుకోవాలని 31 లోపు చేసుకోవాలని తెలియజేశారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి గుండెమడల క్లస్టర్‌కు చెందిన రైతులు 911పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా 848బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 49పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. అధిక బరువుతో ఉన్న 14పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారని తెలిపారు. వీటిలో ఎన్ఎస్ 17ఎన్ బి12కు ఆర్ 20 ఉన్నాయని, కిలో పొగాకు గరిష్ట ధర రూ.200 కాగా కనిష్ట ధర రూ.180, సగటు ధర రూ.196.37 నమోదు కాగా, వేలంలో 9మంది కంపెనీ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కలిగిరిలో చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కలిగిరి: కలిగిరిలో వేసవి దాహార్తి తీర్చేందుకు పాత పంచాయతీ ఆఫీసు, ఎంపిడిఒ ఆఫీస్ ఎదురుగా చలివేంద్రాలను జెడ్‌పిటిసి పాలూరు మాల్యాద్రిరెడ్డి సోమవారం ప్రారంభించారు. కలిగిరి పంచాయతీలో ప్రజా శ్రేయస్సు కార్యక్రమాలను మరిన్ని చేపడతామని సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి తెలిపారు. కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి, మండల వైసిపి యూత్ నాయకులు కోడూరు కృష్ణారెడ్డి వార్డు సభ్యులు బందారు మనోహర్, ఎ.ప్రభాకర్ రెడ్డి, సుద్దల మోహన్, శ్రీను, గౌడ సంఘ నాయకుడు పి.మాల్యాద్రి, కె.పవన్, ఎంపిడిఒ కార్యర్, విస్తరణాధికారి మధు, కార్యదర్శి కృష్ణారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కావలి: "ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం" కింద డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో కావలి రాజీవ్ నగర్ యు.హెచ్.సిలో సోమవారం గర్భిణులకు, బాలింతలకు డాక్టర్ ద్వారకానాథ్ చౌదరి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ద్వారకానాథ్ చౌదరి మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. మాతృమరణాలు, శిశుమరణాలు లేకుండా చూడడం ఈ పథకం ఉద్దేశం అన్నారు. అనంతరం డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ వారు బిస్ పౌలిక్ సిరప్‌లు, కాల్షియం, విటమిన్ ఎంపిణీ చేశారు. డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ కె.శివకోటిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, వైద్య సిబ్బంది రాధిక, ప్రభాకర్, గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు సర్వీసు మీటర్లు

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రభుత్వం వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలకు విద్యుత్ సర్వీసు మీటర్లను చేకూర్చడం జరిగిందని సేవాభావమైన ఎపిఎస్‌పిడిసిఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఎస్.వి. సుబ్బరాజు విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో ఏఈ ఛాంబర్‌లో టౌన్ డివిజన్ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఏ. సోమశేఖర్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

సిసిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు పంచాయతీ బృందావన కాలనీలో సోమవారం ఎంపిపి నిధులతో సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని మండల అధ్యక్షురాలు మేకల సుజాత, మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, బోగోలు సర్పంచ్ పి.అనిత, యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు నిర్వహించారు. మేకల శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న గడప గడపకు కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆదేశాల ప్రకారం ఎంపిపి నిధులతో సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్నామన్నారు. వార్డ్ సభ్యులు రాజశేఖర్, కో ఆప్షన్ మెంబెర్ నాయబ్‌రసూల్, ఎంపిటిసి సుందర్ రాజ్, పి.ఉదయ్ కుమార్, అర్పుదారాజ్, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి

4వ డివిజన్ శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ కార్మికులకు లోన్లు ఇప్పిస్తానని, కార్మికులను ప్రలోభ పెడుతూ, తరచుగా ఇబ్బందులకు గురి చేస్తున్నందున ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిఐటియు నాయకులు ఇన్‌ఛార్జి కమిషనర్ యు.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ గతంలో కూడా కార్మికులను కూడా ఇలాంటి ఇబ్బందులకు గురి చేస్తుంటే ఆయనపై చర్యలు తీసుకోవాలని రెండుసార్లు ఫిర్యాదు చేసి ఉన్నామని తెలిపారు. అయినా ఆయనలో ఎలాంటి మార్పులేదన్నారు. ఇప్పుడు మళ్లీ కార్మికులను వయస్సు పైబడిందని, పనులకు ఆపివేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇదేమని కార్మికులు ఆయనను ప్రశ్నిస్తే రకరకాలుగా

ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కార్మికులను ఇబ్బందులు పెడుతున్నాడని ఆరోపించారు. ఇన్‌స్పెక్టర్ స్వలాభం కోసం ఒక్కొక్క కార్మికులకు మూడున్నర లక్ష రూపాయలు బ్యాంకు లోన్లు ఇప్పిస్తామని, ప్రలోభ పెడుతున్నాడని, గతంలో ఆయన పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోక పోవడం వల్ల మితిమీరి పోతున్నాడని దుయ్య బట్టారు. ఆయన బాటలో మరోపక్క సచివాలయ కార్యదర్శి మూడవ డివిజన్‌లో మస్టర్ వేసే అధికారి డిఎం ఆఫీసు నుండి కాగితాలు వచ్చాయని, 10 సంవత్సరాలు సర్వీస్ ఉన్న కార్మికులను పర్మినెంట్ చేస్తారని అందుకు ఆధార్, జిరాక్స్ ఓటిపి నెంబర్లు ఇవ్వాలని, అంతే కాకుండా రెండు లక్షల రూపాయలు బ్యాంకు లోన్లు ఇస్తామని, మస్టర్ పాయింట్లోనే బహిరంగంగా చెబుతూ కార్మికులను గందరగోళానికి గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకుపోగా, ఈ విషయాలు తనకు తెలియదని, విచారించి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారన్నారు. ఇలా కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్న ఇద్దరిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటిపై త్వరలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మధుసుధనరావు, బి.కృష్ణయ్య, కార్మికులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు చెరువు కలుజుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పాటూరు, గుమ్మళ్లదిబ్బ, బుచ్చి, కొడవలూరు గ్రామాల ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చాలని గండవరపు శేషయ్య పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం కలుజుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కరపత్రాలు పంచి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం మొదలైతే కోవూరు చెరువుకలుజు ప్రయాణం ఆటంకంగా మారుతుందని, ప్రభుత్వం వెంటనే ప్రత్యేక గ్రాంట్ ఇచ్చి బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. కోవూరు పట్టణానికి అతి తక్కువ సమయంలో చేరుకునే ప్రధాన రహదారి అంతే కాకుండా ముంబై రోడ్డులో నుంచి నేషనల్ హైవే లింక్ రోడ్డుగా ఉందని ఈ బ్రిడ్జి నిర్మాణం చేస్తే రైతులకు, చేనేత వస్త్ర వ్యాపారులు, రోజువారీ కూలీలకు, చిరు వ్యాపారులకు రోజు వందలాది వాహనాల్లో ప్రయాణం చేస్తారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన కలుజుపై బ్రిడ్జి నిర్మాణాన్ని ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు గుర్తించి నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం గుర్తించే వరకు పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాబు, సుబ్బారావు, సురేంద్ర, సురేష్, విజయకుమార్, కాలేషా, మల్లికార్జున రెడ్డి, హుమాయన్, హరి, అప్రోజ్, చాన్‌బాషా, బుజ్జియ్య, పెద్దబ్బయ్య, ఖాదర్ బాషా, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ చేపడుతున్న సిపిఎం నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి నిరసన

ప్రజాశక్తి-సీతారామపురం: పేద ప్రజల నడ్డి విరుస్తూ పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని మండల టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు సంవత్సరాలలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిన ఘనత వైసిపికే దక్కుతుందని, పేదలపై సుమారు రూ.56 వేల కోట్ల భారాన్ని మోపి పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వంగా వైసిపి ప్రభుత్వం నిలిచిందన్నారు. మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, సీనియర్ నాయకుడు నేలటూరి జాషువా, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సింగాల నాగేశ్వరరావు, తురక వెంకటేశ్వర్లు, ఇశ్రాయిల్, ప్రవీణ్, సుమన్, రాజేష్, కిరణ్, ఖాజా మొహిద్దిన్, పెద్ద గౌస్, జయరాములు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు సూచనలతో ఉదయగిరి రోడ్డులోని ఎలక్ట్రికల్ డివిజనల్, ఇంజనీర్ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో పాల్గొన్న కావలి పట్టణ, రూరల్ మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని, సైకో పోవాలి! సైకిల్ రావాలి! అనే నినాదాలు చేశారు. నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, బొట్లగుంట శ్రీహరి నాయుడు, జ్యోతి బాబురావు, పోతుగంటి శ్రీకాంత్, ద్రోణదుల వాసంతి, కాకి ప్రసాదరావు, గొట్టిపాటి రాము, మక్కి శ్రీహరి, అమదాలదిన్నె శ్రీను, సురేంద్ర, కాకి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్: పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని సోమవారం ఆత్మకూరు ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ కార్యాలయంలో టిడిపి నాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం ఆ శాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ మండల్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మద్దినేని నారాయణ, పట్టణ మాజీ కౌన్సిలర్లు నాగభూషణమ్మ, బొగ్గవరపు శ్రీకాంత్, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పయ్యావుల మారుతి నాయుడు, తాటిపర్తి పెంచలయ్య, ప్రవీణ్, సాగర్, తోడేటి పెంచలయ్య, ఎస్కే మస్తాన్, గోరి షబ్బీర్, బేకరీ మస్తాన్, ఎస్కే కాజా మస్తాన్, బాలకృష్ణ, రాచూరి రమణయ్య, పాలేటి శేషారెడ్డి, మహేష్, సుశీలమ్మ, కోటేశ్వరి, పొట్లూరి రమణయ్య, చంద్రశ్రీధర్, నవీనేని పెంచలనాయుడు, ఉదయగిరి సుధాకర్, మనోజ్, దండు ప్రవీణ్, బెల్లంకొండ ప్రవీణ్, ఎస్‌డి రవుపు, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి: మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు ఆదేశాల మేరకు పెరుగుతున్న విద్యుత్తు ఛార్జీలపై మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్ఎ ఆదేశాలు రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి చెంచలబాబు యాదవ్ సూచనలతో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మండల టిడిపి నాయకులు కార్యకర్తలతో ముట్టడించామన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలంటూ నినాదాలు చేసి ఇష్టానుసారంగా బిల్లులు వేయడంతో సామాన్యుడు కట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ నరసింహులు, రియాజ్, ఓబుల్ రెడ్డి, వెంకటస్వామి, నల్లిపోగు రాజా, నరసింహులు, మా బాషా, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు, చిన్న బి, మేస్త్రి వెంకటేశ్వర్లు, అలీ, మహిళా అధ్యక్షురాలు అక్కమ్మ, నవాజ్, నరసయ్య, పులిసందాన్ని, కాంతారావు, వెంగయ్య, అక్రమ్, గడ్డం నాయుడు, ఆబిత్ పిచ్చయ్య, జల్సా బాలకృష్ణ, రామ్మోహన్, శివకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట: పెరిగిన విద్యుత్ ఛార్జీలను వెంటనే నియంత్రించాలని బోగోలు మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చెంచులక్ష్మిపురంలోని ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి శ్రేణులు బైఠాయించి పెరిగిన విద్యుత్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియంత్రించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లేలపల్లి సుధీర్ బాబు, రావి విజయ్ కుమార్, ఆవుల సురేష్, దన్యాసి శ్రీధర్, ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి, కాంట్రా రఘురాం నాయుడు, పొట్టేళ్ల శ్రీహరి, నాటక రాని భాస్కర్, సుబ్బారెడ్డి, సీనయ్య, బంక శ్యామ్, ప్రసన్న, సంధాని, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు: మండలంలోని గోగులపల్లి రోడ్డు వద్ద ఉన్న సబ్ స్టేషన్ వద్ద సోమవారం టిడిపి నేతలు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు రామిశెట్టి కృష్ణ చైతన్య మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యుడు బతికి బట్టకట్టే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. వ్యవసాయ రైతులు వాడుకునే మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం సబబు కాదన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి దిష్టిబొమ్మను అతికించి వెళుతున్నారని చలోక్తులు విసిరారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, చంతాటి రాజశేఖర్ బాబు, బుల్లా కృష్ణారెడ్డి, కత్తుల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు: నిత్యావసర ధరలు పెరిగి ఒకవైపు పేద మధ్యతరగతి ప్రజలు అల్లాడుతుంటే ఇప్పటికి ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల నడ్డి విరిచారని మండల టిడిపి అధ్యక్షులు చంద్ర మధుసూధన్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర టిడిపి ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ బొల్లినేని రామారావు ఆదేశాలతో వరికుంటపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ కుద్దుష్ బాషా విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు చంద్ర వెంకయ్య, తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మి నారాయణ, పందిటి హరీష్, పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఎటువంటి అభివృద్ధి లేకుండా పోయిందని వారు ఎద్దేవా చేశారు.

విద్యుత్ ఛార్జీలపై పెంపుపై నిరసన

ప్రజాశక్తి-లింగసముద్రం: రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మండలంలోని వెంగళాపురం వద్ద ఉన్న సబ్ స్టేషన్ దగ్గర మండల టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వేముల గోపాలరావు మాట్లాడుతూ 2014లో రాష్ట్ర ఏర్పడినప్పుడు విద్యుత్ లోటు ఉండేది చంద్రబాబు అనేక సంస్కరణలు తెచ్చి ఉత్పత్తి సామర్థ్యాన్ని 10వేల మెగా వాట్స్‌కు పెంచారన్నారు. జగన్‌రెడ్డి వచ్చాక ఒక్క యూనిట్ కూడా ఉత్పత్తి చేయలేకపోయారని కరెంట్ కోతలు ఎక్కువయ్యాయన్నారు. పరిశ్రమలకు పవర్ హాలీడేస్ ఇచ్చే పరిస్థితికి తెచ్చారన్నారు.ఏడు సార్లు చార్జీలు పెంచి ప్రజలపై 17 వేల కోట్లు భారం వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధికార ప్రతినిధి ఎ.కొండయ్య, ప్రధాన కార్యదర్శి పి.మాల్యాద్రి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ బి.నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య, టిడిపి నాయకులు నీలం బ్రహ్మారెడ్డి, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, బోడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ జలదంకి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు సూచనలు మేరకు మండల కేంద్రమైన జలదంకి కరెంట్ ఆఫీస్‌లో మండల పార్టీ అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు కంచర్ల వినోద్ నాయుడు, తెలుగు యువత మునగాల తిరుమల రెడ్డి, నియోజక వర్గం ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరు సుధీర్ బాబు, సుబ్బారెడ్డి, పెంచల నాయుడు, మరెళ్ల మదన్ మోహన్, మండల ఎస్‌సిసెల్ ఏగూరి రఘు, చోడవరం సర్పంచ్ రవి, కొండప నాయుడు, దశరథ రామయ్య, బాల కోటయ్య, చిన బాలకోటయ్య, పాల్గొని నిరసన చేపట్టారు.

పొలం ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి-ఉదయగిరి

మండల పరిధి లోని సర్వారా బాదుకు చెందిన రైతులు తమ పొలం ఆక్రమించేం దుకు అదే గ్రామానికి చెందిన కొందరు ప్రయత్నిస్తున్నారని తహశీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డికి సోమవారం అర్జీ ఇచ్చి న్యాయం చేయాలని బాధ్యత దళితులు కోరారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 723లో గ్రామానికి చెందిన గొల్లపల్లి గురవయ్య గొల్లపల్లి చిన్న వెంకటయ్య తమకు 1977లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఆ భూమిని కొందరు ఆక్రమించాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే జెసిబి మిషన్ ద్వారా తమ పొలాల్లో చెట్లను తీయడం భూమిని చదును చేయడం వంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో అప్పట్లో ప్రభుత్వ స్కీం ద్వారా మంజూరైన బావిని కూడా పూడ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించన తహశీల్దార్ సిబ్బందితో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

ప్రలోభాలతోనే 'యువగళం'కు ప్రజలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు స్వచ్ఛందంగా ప్రజలు రాకపోతే డబ్బులు, బిరియాని ఇచ్చి జనాన్ని ప్రలోభ పెట్టి పాదయాత్రకు పిలిపించుకుంటున్నారని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో మూడవరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల కోసం కులాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తిత్వం చంద్రబాబుది అని విమర్శించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని ఓమ్ము చేయకుండా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అద్భుతమైన పాలన రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ ఎన్ని కుట్రలు చేసినా మరోసారి అధికారంలోకి తామే వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు మావూలూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ యాదవ్, యువనేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల బకాయిలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కావలి: కావలి పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలలో స్కూల్ స్వీపర్స్‌గా పనులు చేస్తున్న వారికి 5 నెలల బకాయి జీతాలు ఇవ్వాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్వీపర్లు ఆర్.డి.ఒ. వి.కె. శీనానాయక్ కివినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో నాడు-నేడు పనుల కింద శానిటైజేషన్ వర్కర్లుగా స్వీపర్లు పట్టణంలో పనులు చేస్తున్నారని తెలిపారు. వీరికి ఐదు నెలల నుండి జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు రాకపోవడంతో వీరికుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం వీరి గోడు పట్టించుకోవట్లేదని ఇప్పటికైనా స్వీపర్లకు వెంటనే 5 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతినెలా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.మధుసుధనరావు, స్వీపర్లు పద్మ, కామాక్షి, శోభ, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత

ప్రజాశక్తి-జలదంకి: జలదంకిలోని పెద్ద చెరువులో అక్రమంగా గ్రావెల్ తోలుతున్న టిప్పర్లను ఎంపిటిసి కుట్టుబోయిన మాధవరావు యాదవ్, జలదంకి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ జలదంకి గ్రామంలో నూతనంగా ఇల్లు కట్టుకున్న వారు బేస్ మట్టంకి మట్టి తోలుకోవాలన్నా, పశువుల పాకాలకి మట్టి తోలుకోవాలన్నా పర్మిషన్ లేదనే నేపంతో అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. కావలి పట్టణానికి చెందిన లేఅవుట్‌లకు జలదంకి చెరువు నుండి గ్రావెల్ తోలేందుకు అధికారులు పర్మిషన్ ఎలా ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇలానే గ్రావెల్ అక్రమంగా తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు.

ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-వరికుంటపాడు: వరికుంటపాడు మండలం నూతన ఎస్ఐగా విజయ శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బాల మహేంద్ర నాయక్ కావలి టూ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

అన్ని రంగాల్లోనూ ఎపి ప్రథమస్థానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం విద్య, ఉపాధి కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పారిశ్రామికంగా అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఇరిగేన్ సచివాలయం పరిధిలోని 21 వార్డు ఎస్‌టి మోడల్ కాలనీ, ఉలవదిబ్బ ప్రాంతాల్లో ఆయన సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయం పరిధిలో గుర్తించిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించారో ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేలా చొరవ చూపాలన్నారు. అనంతరం మోడల్ ఎస్‌టి కాలనీలో ఎంఎల్ఎ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎకు స్థానిక మహిళలు

సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశం చారు. వార్డు పరిధిలో పలువురు లబ్ధిదారులు స్వంతంగా ఇంటి నిర్మాణాలు చేసుకుంటామని, ప్రభుత్వ అనుమతి మంజూరు చేయించాలని కోరడంతో వెంటనే గృహనిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో 93 సచివాలయాల్లో ఇప్పటి వరకు 42 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో 1.74 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, ప్రజాప్రజానిధులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి తాము వెళ్తున్నామని, వాళ్లు కూడా తమతోపాటు వచ్చే ఏం అభివృద్ధి జరగలేదో వివరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నాయకులు ఇందూరు వెంకట రమణా రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడూరు కౌసల్యమ్మ, మహబూబ్‌బాషా, చెరుకూరి కామాక్షయ్య నాయుడు, ఏఈ ప్రససాద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో విక్రమ్ రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉలవదిబ్బలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ ప్రాంతంలోని మసీదులో ముస్లీం సోదరులు, వైసిపి నాయకులతో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదుకు విచ్చేసిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ముస్లీం సోదరులతో కలసి ప్రత్యేక దువా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కఠిన ఉపవాస దీక్షలు ఉన్న ముస్లీం సోదరులకు చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, ఉపవాస దీక్షలను ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్, అభిరామ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ 4, 21 వార్డుల ముస్లీం సోదరులకు పవిత్ర రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు.

పలుచోట్ల 'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లి గ్రామంలో సోమవారం ఎంపిపి దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి ఇంటికి వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు బీద రమేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రతిఒక్క కుటుంబానికి వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని అలాగే కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు చలంచర్ల వేణమ్మ, దర్శిగుంట వెంకయ్య తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-జలదంకి: మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో మండల వైసిపి కన్వీనర్ చేవూరు జనార్దన్ రెడ్డి, వారి సతీమణి సర్పంచ్ సులోచనమ్మ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలో మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కొండూరు బాస్కర్ రెడ్డి, డాక గోపాల్ రెడ్డి, బోయలపాడు చంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, గున్నంరెడ్డి కృష్ణా రెడ్డి, డేగ సురేష్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు: భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనేక రకాల సంక్షేమ పథకాలను సచివాలయ గ్రామ వాలంటీర్ల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భావితరాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సూచనల మేరకు మండల పరిధిలోని వరిని గ్రామం పంచాయతీ గిరిజన కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రావిళ్ల మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి ఇష్టపూర్వకంగా స్టిక్కర్స్ అంటించారు. కార్యక్రమంలో ఎంపిటిసి విందోటి భక్తవత్సలయ, నాయకులు వెంకయ్య, సీనయ్య, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి: తెల్లపాడు గ్రామ సచివాలయ కన్వీనర్ మారెళ్ల సుందర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ అభివృద్ధి పాలన వివరిస్తూ సోమవారం ప్రజల గృహాలకు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి రెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మారెళ్ల మధుసూదన్ రెడ్డి, కుడుములదిన్నెపాడు పిఎసిఎస్ అధ్యక్షులు ములక శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు: కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి సూచనల మేరకు బుచ్చిరెడ్డిపాలెంలోని సుహాసిని కాలనీ, బెస్త పాలెంలో సోమవారం 4వ రోజు "మా నమ్మకం నువ్వే జగన్" ప్రచార కార్యక్రమం 18వ వార్డు కౌన్సిలర్ మోర్ల జయంతి చేపట్టారు. వైసిపి నాయకులు మోర్ల భరత్‌కుమార్, కన్వీనర్ పుచ్చకట్ల పెంచలయ్య, గృహసారథులు ఎస్.కె.గౌస్ బాషా, ఆడిపూడి అలివేలమ్మ, వాలంటీర్ సంపత్ కుమార్, దర్శిగుంట భారతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

KRISHNARAJUNA REDDY B.Ed COLLEGE
Rallachelika, Sangam, SPSR Nellore District.
Permited by NCTE Delhi, Affiliated to V.S. University, Nellore.
(R.C. No.F.SRO/SRCAPP14804/B.Ed/AP/2016/85144: Dated:2-5-2016
Ph: 79934 99360, 99636 52758
Email : krishnaarjunareddybedcollege@gmail.com

B.Ed., ADMISSION NOTIFICATION FOR MANAGEMENT ('B' Category) SEATS & SPOT ADMISSIONS

Eligibility ; B.A./B.Sc.,/B.Com/BCA/BBA/B.Tech/ Post Graduate from any UGC Recognised Indian University OC: 50% of marks in Aggregate and BC/SC/ST: 45% of marks Aggregate in the Degree / PG Degree in Relevent Methodology. Applications are Invited from the Eligible Candidates to fill the Category 'B' (Management) and Spot Admissions two Year B.Ed., Seats for the Batch 2022-23 Last Date for Receipt of Filled Applications and Allotments is 14-04-2023 Seats Will be filled as per the norms of the Convenor AP Ed. CET-2022 and APSCHE GUNTUR.

Secretary / Correspondent **Principal**

కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
I.P.No. 1/2017
చల్లగుండ్ల నరశింహారావు ... పిటిషనరు
Vs
దారుకుమల్లి బ్రహ్మా రెడ్డి (Died)
వగైరా ... రెస్పాండెంట్లు
To,
R6. **దారుకుమల్లి ఆదిలక్ష్మి,** భర్త లేట్ బ్రహ్మారెడ్డి
R7. **కంజుల ప్రవల్లిక, భర్త మదన్ మోహన్ రెడ్డి**
R8. **దారుకుమల్లి నందిని,** తండ్రి లేట్ బ్రహ్మారెడ్డి
R6 to R8 R/o కోవూరు గ్రామం & పోస్టు, కందుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పాత ప్రకాశం జిల్లా.
పై నెంబరు పిటిషన్‌లో 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం పై పిటిషన్ **తేది: 13-4-2023దిన** వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు పగలు **10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ మీ ప్లీడరు గారి ద్వారా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమందు తీర్మానింతురు.
(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 13-04-2023
ఇట్లు
శ్రీవలేటి శ్రీధర నాయుడు, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేటు, కందుకూరు.
సెల్: **98494 59336**